

కళాశాలలకు మహర్దశ

జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు, మరమ్మతు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 8లో



.. అర్థమయ్యేలా బోధించాలి

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని, వారి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

అప్‌గ్రేడ్ అయినా.. అవే సమస్యలు



ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ భవనం (ఇన్‌సెట్) యూనివర్సిటీ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు



ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని వీడని కష్టాలు..

- కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, పాముల పుట్టలు
- నిధులు విడుదలైతేనే అభివృద్ధికి అవకాశం
- నేడు మంత్రి తుమ్మలతో పాటు వీసీ బృందం పరిశీలన

కొత్తగూడెంఅర్బన్ : కొత్తగూడెం కేఎస్‌ఎంలోని మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరమే తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ.. వైస్ చాన్స్‌లర్ నియామకం మినహా ఎలాంటి నిధులు, సౌకర్యాలు సమకూర్చ లేదు. ప్రస్తుతం ఇక్కడ 11 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా మరో ఎనిమిది మంది కాంట్రాక్టు పద్ధతిన నియమితులయ్యారు. 45 మంది బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారు. యూనివర్సిటీలో అడ్మిషన్లు మొదలై తరగతులు ప్రారంభిస్తే క్లాస్‌రూమ్‌లు సరిపోయినా.. కొత్తగా వచ్చేవారికి హాస్టళ్లతో పాటు ఇతర సౌకర్యాలూ కష్టమే. ఒకటి, రెండు సెమిస్టర్లు ఎలాగో నెట్టుకొచ్చినా వచ్చే ఏడాది వరకు అన్ని వసతులు కల్పించాలి. లేదంటే యూనివర్సిటీ సజావుగా సాగే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం ఉన్న హాస్టల్, మెస్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొన్ని గదులు వర్షమొస్తే కురుస్తున్నాయి. ఇక యూనివర్సిటీ ప్లే గ్రౌండ్ అంతా పిచ్చి మొక్కలు, పాము పుట్టలతో నిండి ఉంది. రోడ్ల పరిస్థితీ అధ్వానంగానే ఉంది. హాస్టళ్లతో పాటు ఇతర అన్ని నిర్మాణాలకూ సరిపడా స్థలం ఉన్నా నిధులు లేవు.

పరిహారమూ అందలేదు..

గతంలో కళాశాల స్థాయిలో ఉన్నప్పుడే ఏర్పాటైన ప్రత్యేక కమిటీ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి వసతుల కల్పనకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ మేరకు హామీ ఇచ్చిన గత ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. ఈ యూనివర్సిటీ మొత్తం 300 ఎకరాల్లో విస్తరించి ఉండగా కలెక్టరేట్ నిర్మాణానికి 20 ఎకరాలు, ఎస్పీ కార్యాలయానికి 20 ఎకరాలు, మెడికల్ కాలేజీకి 30 ఎకరాలు తీసుకున్నారు. ఇవన్నీ కలిపి పరిహారంగా రూ.168 కోట్లు రావాల్సి ఉండగా అవి కూడా ఇంత వరకు అప్పగించలేదు. దీంతో కళాశాలలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు సమస్యల నడుమ కొట్టుమిట్టాడుతున్నారు.

ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ బోర్డు ఏర్పాటు

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పేరును డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణగా ఇప్పటికే మార్చగా.. మంగళవారం నూతన బోర్డు ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి, విద్యాశాఖ కార్యదర్శి సందర్శించనున్న నేపథ్యంలో ఈ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు నేటి సమావేశ హాల్‌ను సైతం సిద్ధం చేశారు.

నేడు మంత్రి, ఉన్నతాధికారుల పరిశీలన..

యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు, అవసరమైన వసతులు, నిధుల కేటాయింపు తదితర అంశాలను పరిశీలించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు యూనివర్సిటీ వీసీ, విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, తెలంగాణ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీరామ్ వెంకటేష్, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ రాంచందర్ తదితరులు బుధవారం రానున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వీరు అందించే ప్రతిపాదనల ఆధారంగా ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో పాటు బోధన, బోధనేతర సిబ్బందిని అదనంగా నియమించడం, ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

యోగితారాణా పర్యటన ఇలా..

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ క్యాంపస్, మెడికల్, ఇంజనీరింగ్ కాంప్లెక్స్‌ను సందర్శించి, వీసీలతో సమీక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు యోగితా రాణా శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలను పరిశీలించనున్నారు. 3.30 గంటలకు భవిత కేంద్రాన్ని, సాయంత్రం 6.30 గంటలకు కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేయనున్నారు. అనంతరం బూర్గంపాడులోని టీజీఆర్‌జీఐఎస్ పరిశీలన, విద్యార్థులు, సిబ్బందితో సమీక్షించి, రాత్రికి అక్కడే బస చేస్తారని తెలిసింది.

ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా రామచంద్రం



కేయూ క్యాంపస్: ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వీసీ ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు. ప్రొఫెసర్ రామచంద్రం 1991లో కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులై ప్రస్తుతం సైకాలజీ విభాగం అధిపతిగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది జనవరి 31న కేయూ రిజిస్ట్రార్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే, కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన అసోసియేట్ ప్రొఫెసర్ జగన్‌మోహన్‌రావును ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ)గా నియమించారు.

భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



వీసీలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన అదనపు కలెక్టర్, డీఎఫ్‌ఓ

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సచివాలయం నుంచి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణాగౌడ్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, తిరస్కరణకు గురైతే కారణాలను పొందుపర్చాలని ఆదేశించారు. ఐదు రోజుల్లో పూర్తి నివేదిక అందజేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుల పరిష్కారం పూర్తి కావాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు. దీనికి అవసరమైన సహాయ సహకారాలను అటవీ శాఖ నుంచి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ డీడీ మణెమ్మ, హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, ఎస్సీ సంక్షేమాధికారి అనసూయ, బీసీ సంక్షేమాధికారి ఇందిర, డీఈఓ వెంకటేశ్వరాచారి, పౌరసరఫరాల శాఖ డీఎం త్రినాథ్‌బాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ చైర్మన్

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులైన పసుపులేటి వీరబాబు మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధిపై చర్చించారు.

మునగ, నేరేడు మొక్కలు నాటండి

టేకులపల్లి మండల పర్యటనలో కలెక్టర్



పాతతండా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

టేకులపల్లి : పాఠశాలలు, ఆస్పత్రుల ఆవరణల్లో మునగ, నేరేడు మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని పాతతండా ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన బోధన అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ జగన్, హెచ్‌ఎం లక్ష్మణ్‌కు సూచించారు. ఆ తర్వాత సులానగర్ పీహెచ్‌సీని సందర్శించారు. ఓపీ, ఐపీ ఎలా ఉన్నాయని ఆరా తీశారు. పేషంట్లకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నెలలు నిండిన గర్భిణులను సకాలంలో ఆస్పత్రులకు, మైదాన ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగాయని, పాములు తిరుగుతున్నాయని, కోతుల బెడద ఉందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా.. పంచాయతీ సిబ్బంది సహకారంతో తొలగించాలని వైద్యులను ఆదేశించారు. కోతుల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో అధిక దిగుబడి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



అశ్వాపురంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

అశ్వాపురం/కరకగూడెం : రైతులు ప్రత్యామ్నాయ పంటలతో పాటు మేలైన వంగడాలు సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డి అన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, నానో ఎరువులను పిచికారీ చేయాలని, తద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. మంగళవారం ఆయన అశ్వాపురంలో పత్తిసాగు, కరకగూడెం మండలం భట్టుపల్లి రైతు వేదికలో కంది విత్తనోత్పత్తిపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి, విత్తనోత్పత్తిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. రైతు పక్షపాతిగా ఎన్నో కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని, అన్నదాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లాభాల బాట పట్టాలని అన్నారు. రాష్ట్రంలో ప్రధాన పప్పు దినుసుల పంటల్లో ఒకటైన కంది విత్తనోత్పత్తిలో రైతులు క్రియాశీలకంగా పాల్గొంటే స్వయం సమృద్ధి సాధించవచ్చని సూచించారు. అవసరమైన సాంకేతిక సహాయం అందించడానికి విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏడీఏ తాతారావు, ఏఓ చటర్జీ, ఏఈఓలు ప్రశాంత్, అనిల్ కుమార్, ఇఫ్కో సంస్థ మేనేజర్ నాగార్జున, టీపీసీసీ సభ్యులు చందా సంతోష్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలుచేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

జిల్లాలో ఇద్దరు సీఐల బదిలీలు

ఇల్లెందు/కొత్తగూడెంటౌన్: జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ వరంగల్ రేంజ్ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టేకులపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తాటిపాముల సురేష్‌ను ఇల్లెందు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా, ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణపై సస్పెన్షన్ ఎత్తివేసి టేకులపల్లి సీఐగా నియమించారు.

లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

నిలిచిన 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత



సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో చేరిన వర్షం నీరు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ వార్షిక లక్ష్య సాధనలో భాగంగా రోజుకు 1.72 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి శ్రమిస్తుండగా, రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అంతరాయం ఏర్పడుతోంది. సింగరేణి వ్యాప్తంగా రోజుకు 1.72 లక్షల టన్నులకు గాను రెండు రోజుల నుంచి 72 వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదవుతోంది. దీంతో రోజుకు లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తి స్తంభించగా, 18 ఓసీల్లో రోజుకు 15లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్(ఓబీ) వెలికితీత కూడా నిలిచిపోయింది. ఇదిలా ఉండగా, ఎడతెరిపి లేని వర్షంతో ఓసీల్లోని హాల్‌రోడ్లన్నీ బురద మయం కావడమే కాక భారీగా నీరు చేసింది. దీంతో ప్లాన్‌టూన్ పంపులు, మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపుతున్నారు.

రామాలయం ఈఓకు ఉద్యోగోన్నతి ?

భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవికి ఉద్యోగోన్నతి లభించినట్లు సమాచారం. డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఆమెకు 2023 ఫిబ్రవరిలో ఆలయ ఈఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అనంతరం కొద్ది నెలలకే ఫుల్ ఇన్‌చార్జిగా జీఓ విడుదల చేశారు. కాగా డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న రమాదేవి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అయితే ఇక్కడ ఈఓగా కొనసాగిస్తారా లేక మరో చోటకు బదిలీ చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

పెద్దమ్మతల్లి గుడిలో నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం - జగన్నాథపురం మధ్య కొలువైన పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా బుధవారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే హోమంలో పాల్గొనేందుకు రూ.1,516 చెల్లించి గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. అలాగే, పెద్దమ్మగుడి ఆలయ సముదాయంలోని శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారికి బుధవారం పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

25 నుంచి శ్రావణ మాసోత్సవాలు

ఆగస్టు 4 నుంచి 9 వరకు రామాలయంలో పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో స్వామి వారు (ఫైల్)

భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈనెల 25 నుంచి శ్రావణమాసోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు మంగళవారం వివరాలు వెల్లడించారు. 25న పుష్యమి నక్షత్రం సందర్భంగా స్వామివారికి పట్టాభిషేకం, ప్రత్యేక నవకలశ స్నపన తిరుమంజనం, సామూహిక అష్టోత్తర శతనామార్చన, 28న అండాళ్ అమ్మవారికి తిరుమంజనం, ఆగస్టు 1న శ్రీలక్ష్మీతాయారు అమ్మవారికి కుంకుమార్చన, సంధ్యాహారతి జరపనున్నారు. ఆగస్టు 4న పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 5న అగ్నిప్రతిష్ఠ, పవిత్రాధివాసం, అష్టోత్తర శతకలశావాహనం, 6న స్నపన తిరుమంజనం, పవిత్రారోపణం, హోమం, 7న ప్రత్యేక పవిత్రోత్సవముం, 8న శ్రావణ శుక్రవార వరలక్ష్మీ వ్రతం, సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. 9న హయగ్రీవ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం, ఉత్సవ సమాప్తి, 15న సామూహిక కుంకుమార్చన, 19న సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన, 22న అమ్మవారికి పుష్పాంజలి తదితర పూజలు ఉంటాయని అధికారులు వివరించారు. కాగా 24 నుంచి 28 వరకు అండాళ్ అమ్మవారి తిరునక్షత్రోత్సవాల సందర్భంగా రాత్రి విశేష సేవాకాలం, విశేష భోగాలను రద్దు చేశారు. పవిత్రోత్సవాలు సందర్భంగా 5 నుంచి 9 వరకు నిత్యకల్యాణాలు రద్దు చేసినట్లు వెల్లడించారు.

మహాలక్ష్మీ కటాక్షం

- అతివలకు కలిసొస్తున్న ఉచిత ప్రయాణం
- ఖమ్మం రీజియన్‌లో 7.38 కోట్ల ఉచిత ప్రయాణాలు
- తద్వారా రూ.331.05 కోట్ల చార్జీలు ఆదా
- నేడు సంబురాలకు ఏర్పాట్లు చేస్తున్న ఆర్టీసీ



తొలిరోజు ఇల్లెందులో ప్రయాణిస్తున్న మహిళలు



ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. 2023 డిసెంబర్ 9న ఈ పథకం అందుబాటులోకి రాగా ఇప్పటివరకు ఖమ్మం రీజియన్‌లో 7,38,14,406 మంది ఉచితంగా ప్రయాణించారని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన నేపథ్యాన బుధవారం సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఖమ్మం రీజియన్ వ్యాప్తంగా వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో జరిగే ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

'చిరు' జీవితాల్లో వెలుగులు..

మహాలక్ష్మి ద్వారా కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం పేద మహిళలకు అండగా నిలుస్తోంది. ప్రయాణ ఖర్చులు లేకపోవడంతో ఆ వనరులను కుటుంబీకుల విద్య, ఆరోగ్యం, చిరు వ్యాపారాలకు మళ్లించగలుగుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగాలకు సిద్ధమవుతూ పట్టణాలకు వెళ్లి వచ్చే యువతులపై ఆర్థిక భారం తగ్గినట్లయింది. అలాగే, గ్రామీణ మహిళలు మెరుగైన వైద్యసేవల కోసం ఆస్పత్రులకు ఉచితంగా వెళ్లివస్తున్నారు. కూరగాయలు, పూలు, ఇతర చిరు వ్యాపారాలు చేసే వారికి సైతం ఈ పథకం ఉపయోగపడుతోంది.

ఇప్పటివరకు రీజియన్‌లో మహాలక్ష్మి ప్రయాణికుల వివరాలు, ఆదా అయిన నగదు

డిపో	ప్రయాణించిన మహిళలు	ఆదా అయిన చార్జీలు (రూ.కోట్లలో)
ఖమ్మం	1,68,28,069	81.42
మధిర	67,76,202	48.69
సత్తుపల్లి	1,73,32,735	61.43
భద్రాచలం	82,99,912	41.14
కొత్తగూడెం	1,06,83,004	40.62
మణుగూరు	1,12,33,835	48.09
ఇల్లెందు	26,60,649	9.66
మొత్తం	7,38,14,406	331.05

ఆనందంగా ఉంది..



స్వయం సహాయక సంఘం తరఫున తయారుచేసే బనియన్ల అమ్మకానికి రోజుకో ఊరు వెళ్తాం. ఉచిత ప్రయాణంతో ఆ ఖర్చులు మిగులుతున్నాయి. వృత్తి వ్యాపారంలో రాణించడానికి ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యం ఉపయోగపడుతోంది.– **గుండా తిరుపతమ్మ, కొర్లగూడెం, నేలకొండపల్లి మండలం**

కష్టార్జితం మిగులుతోంది..



కుటుంబ పోషణ కోసం ఖమ్మంలోని పండ్ల దుకాణంలో పనిచేస్తున్నా. గతంలో బస్సు చార్జీ ఉండడంతో వచ్చే తక్కువ వేతనంలో కొంత ఖర్చయ్యేది. కానీ ఇప్పుడు ఉచితంగా ఆర్టీసీ బస్సులో వచ్చివెళ్తుండడంతో వేతనం ఆదా అయి ఇతర అవసరాలకు వెచ్చించగలుగుతున్నా.

– పిట్టల దుర్గ, బోనకల్

మహిళల ముఖాల్లో చిరునవ్వులు



మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూస్తున్నాం. వారి దైనందిన జీవితాల్లో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఉచిత రవాణా మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా అండగా నిలుస్తోంది.

– ఏ.సరిరామ్, రీజినల్ మేనేజర్, ఖమ్మం

జిల్లాలో జోరు వాన..

జిల్లా వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల పరిధిలోని లో లెవెల్ చప్టాలు నీట మునిగాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మణుగూరు పట్టణంలో మూడున్నర గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పలు వీధులు నీట మునిగాయి. అశోక్‌నగర్‌లోని ఓ వీధి జలదిగ్బంధం అయింది. టేకులపల్లి మండలంలోని పుణ్యపు వాగు ఉధృత ప్రవాహంతో ఆళ్లపల్లి – టేకులపల్లి – కొత్తగూడెం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

– మణుగూరు టౌన్/టేకులపల్లి



టేకులపల్లి మండలంలో పుణ్యపువాగు ప్రవాహంతో నిలిచిపోయిన వాహనాలు



మణుగూరులో ఓ వీధిని ముంచెత్తిన వరద



టేకులపల్లి మండలం తావుర్యాతండాలో..

క్లుప్తంగా

ప్రిన్సిపాల్, వార్డెన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కళాశాల గేట్ వద్ద విద్యార్థినుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థినులు

భద్రాచలంటౌన్: భద్రాచలం గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్‌పై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు కళాశాల ప్రధాన గేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. కళాశాలలో రెండు రోజుల కిందట విద్యార్థినులకు ఉదయం వడ్డించే కిచిడీలో పురుగులు వచ్చాయని ఆందోళన చేయడంతో విచారణకు ఆదేశించిన ఐటీడీఏ పీఓ.. ఘటనకు కారకులైన వార్డెన్, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, విద్యార్థినులు వార్డెన్, ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ధర్నా చేయడం చర్చనీయాంశమైంది. కళాశాలలో మెనూ అమలు విషయంలో ప్రిన్సిపాల్, వార్డెన్‌ల నిర్లక్ష్యం లేదని, బియ్యంలో పురుగులు ఉండడంతోనే అలా జరిగిందని వారు పేర్కొన్నారు.

ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు



చంపాలాల్

సుజాతనగర్: ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే ఈ రోజుల్లో చాలాకష్టంతో కూడుకున్న పని. కానీ, మారుమూల గ్రామంలో రైతు కుటుంబంలో పుట్టిన మాలోత్ చంపాలాల్ ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన మాలోత్ గ్యామా, సాలి దంపతుల రెండో కుమారుడు చంపాలాల్ నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ)లో జూనియర్ ఇంజనీర్‌గా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. అలాగే, ఇటీవల విడుదలైన ఆర్ఆర్‌బీ ఫలితాల్లో జూనియర్ ఇంజనీర్‌గా మరో కొలువు సాధించాడు. ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన చంపాలాల్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఎస్సీ రైతులు పేర్లు నమోదు చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అశ్వారావుపేట ఉద్యాన పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగుపై ఎస్సీ రైతులకు ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేయనున్నామని, ఆసక్తి ఉన్నవారు పేర్లు నమోదు చేసుకోవాలని పరిశోధనా స్థానం శాస్త్రవేత్త విజయ్‌కృష్ణ కోరారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. భారతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ సౌజన్యంతో ఎస్సీ రైతులకు పలురకాల ఉద్యాన పంటల సాగుపై త్వరలో ఒకరోజు శిక్షణ నిర్వహిస్తామని, ఈ నెల 27వ తేదీలోపు తమ పేర్లను 79958 90625 నంబర్‌లో సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు. శిక్షణలో ఒక్కొక్క రైతు కు 10 రకాల పండ్ల మొక్కల్ని అందించి, వాటి పెంపకంపై శిక్షణ ఇస్తామని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

కళాశాలలకు మహర్దశ

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మరమ్మతులకు నిధులు
- మౌలిక వసతులు, క్రీడా సామగ్రి, ఇతర ఖర్చులకు రూ.3.31 కోట్లు విడుదల
- జిల్లాలో 14 కళాశాలలకు నిధులు



పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల

పాల్వంచరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు, మరమ్మతులు, అదనపు తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్న తురణంలో ప్రభుత్వం కళాశాలల ప్రగతిపై దృష్టి సారించి నిధులు మంజూరు చేసింది. దీంతో జూనియర్ కాలేజీల్లో ఇక వసతులు మెరుగుపడనున్నాయి. జిల్లాలో మొత్తం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 14 ఉండగా ఇందులో చదువుకునే విద్యార్థులు ఐదు వేలకు పైగా ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం జిల్లాలోని జూనియర్ కళాశాలలకు రూ.3,35,71,000 విడుదల చేయగా, అందులో మరమ్మతుల కోసం రూ.3,31,15,000, మెయింటెనెన్స్ కోసం రూ.3.16 లక్షలు, క్రీడాసామగ్రి కోసం రూ.1.40లక్షలు కేటాయించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ప్రతి జూనియర్ కళాశాలకు రూ.10వేల చొప్పున క్రీడా సామగ్రి కొనుగోలుకు కేటాయించారు.

కళాశాలలకు కేటాయించిన నిధులు..

కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల (జీజేసీ)కు రూ.58.50 లక్షలు కేటాయించారు. భద్రాచలం జీజేసీకి రూ.15.40 లక్షలు.. పాల్వంచ జీజేసీకి రూ.13.34 లక్షలు, మణుగూరు జీజేసీకి రూ.16.84 లక్షలు, అశ్వాపురం జీజేసీకి రూ.18.26 లక్షలు ఇల్లెందు జీజేసీకి రూ.37.34 లక్షలు, అశ్వారావు పేట జీజేసీకి రూ.9.41లక్షలు, చర్ల జీజేసీకి రూ.22.90లక్షలు, బూర్గంపాడు జీజేసీకి రూ. 22.76 లక్షలు, పినపాక జీజేసీకి రూ.18.76 లక్షలు, గుండాల జీజేసీకి రూ.14.26 లక్షలు, టేకులపల్లి జీజేసీకి రూ.31.26 లక్షలు, దుమ్ముగూడెం, ములకపల్లి జీజేసీకి రూ.39.34 లక్షలు కేటాయించారు. కాగా, ప్రతి కళాశాలలో రూ.10 వేలు క్రీడా సామగ్రి కొనుగులుకు వినియోగించగా.. మిగిలిన డబ్బులను మెయింటెనెన్స్, మరమ్మతుల కోసం వినియోగించనున్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి..



జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలి. కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ ఆదేశాల మేరకు కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో పంచాయతీ రాజ్ శాఖ, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగాల పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తారు.

–హెచ్.వెంకటేశ్వరరావు, డీఐఈఓ

నారు ఆలస్యం.. జాగ్రత్తలు అవసరం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వర్షాలు సకాలంలో కురవక పోవడం వల్ల వానాకాలం ఆలస్యంగా ప్రారంభమైంది. వాతావరణ శాఖ సమాచారం మేరకు రాబోయే మూడు రోజుల నుంచి ఐదు రోజుల వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరినాట్లు వేసుకోవడానికి సిద్ధం కావాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ముందుగా వరిపోసిన వరి నారు 40 నుంచి 50 రోజుల దశలో ఉంది. నారు చివరి రెండు నుంచి మూడు సెంటీమీటర్ల వరకు తుంచి కుదురుకు మొక్కల సంఖ్యను పెంచి చాలా దగ్గరదగ్గరగా నాట్లు వేసుకోవాలి. ఎకరానికి సిఫారసు చేసిన నత్రజని, భాస్వరం, పొటిషియం ఎరువులకు అదనంగా మరో 20 నుంచి 25 కిలోల యూరియా వేసుకుంటే నారు మొక్కలు త్వరగా దుబ్బు చేస్తాయి. రైతులు 50 నుంచి 55 రోజుల దశలో ఉన్న ముదురునారు నాటాల్సి వచ్చినపుడు నారు చివర్లు తుంచి కుదురుకు మొక్కల సంఖ్య 6 – 8 పెంచి మొత్తం వరికి సిఫారసు చేసిన నత్రజనికి అదనంగా 25శాతం కలిపి.. మొత్తంలో 70 శాతం దమ్ములో.. 30శాతం అంకురం దశలో వేయాలి. 60 రోజుల వయసు మించి ఉన్న నారును రైతులు ఎట్టి పరిస్థితుల్లో నాటు వేయొద్దు. ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1010, కునారం సన్నాలు లాంటివి ఎంపిక చేసుకుని 15 – 20 కిలోల విత్తనాన్ని డ్రమ్‌సీడర్ లేదా వెదజల్లే పద్ధతిలో వేసుకోవాలి. జీలుగ వేసుకున్న రైతులు పూత దశ దాటితే కాండం దృఢంగా మారి చిలకడానికి ఎక్కువ రోజులు పట్టే అవకాశం ఉన్నందున వీలైనంత త్వరగా ఎకరానికి 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువును చల్లుకుని రొటోవేటర్ సాయంతో బాగా కలిసే విధంగా కలియదున్నుకోవాలి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మణుగూరురూరల్: అసాంఘిక కార్యకలాపాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి నేతృత్వంలో సీఐ పాటి నాగబాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రతీ ఇంటిని తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 44 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలు, బెల్ట్ దుకాణాల్లోని రూ.25 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, ద్విచక్ర వాహనదారులు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని, వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు పంపే లింకులను ఓపెన్ చేయొద్దని పేర్కొన్నారు. చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బెల్ట్ దుకాణాలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు డీఎస్పీకి తెలపడంతో సంబంధిత షాపు యజమానులను హెచ్చరించారు. అనంతరం సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐలు రంజిత్, మనీషా, సురేశ్, మధుప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్ఆర్‌నగర్‌కు చెందిన కండెల్లి మహేశ్(30) మద్యం మత్తులో ఈ నెల 5వ తేదీన బ్లేడ్‌తో గొంతుపై కోసుకున్నాడు. కాగా, భార్య వెంకటరమణ ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా గొంతుపై స్వల్ప గాయమే కావడంతో చికిత్సకు నిరాకరించాడు. ఈ క్రమంలోనే కామెర్లు రాగా మందులు వేసుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. తీవ్రఅనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 13న భార్య స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించింది. మెరుగైన వైద్యం కోసం ఈ నెల 17న వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా ఆదివారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతి చెందా డు. కాగా, మృతుడి భార్య మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కూతురిపై తండ్రి దాడి

కేసు నమోదు

బూర్గంపాడు: కన్న కూతురుపై దాడికి పాల్పడిన తండ్రిపై బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో మంగళవా రం కేసు నమోదైంది. ఎస్‌ఐ మేడా ప్రసాద్ కథనం ప్రకారం.. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో పనిచేస్తున్న ఓ వ్యక్తి తన కూతురు (మైనర్)ను కాలితో తన్ని భయభ్రాంతులకు గురిచేశాడు. సమాచారం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సక్కుబాయి బాలిక ఇంటికి వెళ్లి విచారణ చేసింది. తండ్రి కాలి తో తన్నుతూ కూతరుపై దాడికి పాల్పడినట్లు విచారణలో తేలడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- చదువుతో పాటు వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలి
- ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీఓ ఆదేశం



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న పీఓ రాహుల్

దుమ్ముగూడెం : విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో చదువుతో పాటు వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలన్నారు. మండలంలోని మంగువాయిబాడవ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేసి, పాఠాలు బోధించారు. అనంతరం మాట్లాడుతూ.. మెనూ సక్రమంగా పాటించాలన్నారు. ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థుల కోసం ఉద్దీపకం-2 వర్క్‌బుక్‌లు రూపొందించామని చెప్పారు. గతేడాది ప్రవేశపెట్టిన ఈ పుస్తకాలతో పిల్లల్లో సామర్థ్యం పెరిగిందని తెలిపారు. ప్రతీరోజు బోధించే పాఠ్యాంశాలతో పాటు అదనంగా ఒక పీరియడ్ విద్యార్థినులకు ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయం, కుట్లు, అల్లికల వంటి వాటిపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వాటికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించి అన్ని పాఠశాలలకు పంపిస్తామని తెలిపారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని, పిల్లలు ఎవరైనా అస్వస్థతకు గురైతే సమీపంలోని పీహెచ్‌సీకి తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరమ్మ, డిప్యూటీ వార్డెన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో జీవనోపాధి

భద్రాచలంటౌన్: పోడు పట్టా కలిగిన గిరిజన రైతులకు ప్రధానమంత్రి జన జాతీయ గౌరవ ఉద్ధరణ అభియాన్ పథకం ద్వారా సబ్సిడీ రుణాలతో జీవనోపాధి కల్పించాలని పశుసంవర్ధక శాఖ అధికారులను పీఓ రాహుల్ ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై మంగళవారం ఆయన వారితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ ద్వారా పోడు పట్టాలు పంపిణీ చేసిన గిరిజన రైతులకు ఈ పథకం వర్తింపజేయాలన్నారు. తద్వారా 90 శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం వంటి యూనిట్లు అందించాలన్నారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఎంపీడీఓలు, గ్రామ కార్యదర్శులు కూడా గ్రామాల్లో ఈ పథకాలపై అవగాహన కల్పించాలని, ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. సమావేశంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఏడీ రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పాల్వంచ: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల్లో రాణించాలని సూచించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంటే దోమలు ప్రబలకుండా ఉంటాయని సూచించారు. నవ లిమిటెడ్ వారు విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకుంటున్న చర్యలను అభినందించారు. కార్యక్రమంలో నవ లిమిటెడ్ జనరల్ మేనేజర్‌లు ఎంజీఎం ప్రసాద్, బి.రామారావు, పాఠశాల హెచ్‌ఎం రమ, మొబైల్ సైన్స్ సిబ్బంది రాజేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

తృటిలో తప్పిన ప్రమాదం

వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన స్థానికులు



గాయపడిన శ్రీను

టేకులపల్లి: చింతలతండా – గుండ్లమడుగు గ్రామాల మధ్య ఉన్న పుణ్యపు వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని మంగళవారం స్థానికులు రక్షించారు. వివరాలిలా ఉన్నాయి. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆర్టీసీ బస్సుతో పాటు ఇతర వాహనాలు నిలిచిపోయాయి. గుండ్లమడుగు గ్రామానికి చెందిన సర్వ శ్రీను కొత్తగూడెం వెళ్లేందుకు పుణ్యపు వాగు వద్దకు వచ్చి బస్సు ఎక్కాడు. కొంత సేపటికే అందరూ వద్దని వారిస్తున్నప్పటికీ బస్సు దిగి వాగు దాటుతున్న క్రమంలో అదుపుతప్పి కొట్టుకుపోయాడు. స్థానికులు వెతికి బయటకు తీసుకొచ్చారు. వారు సకాలంలో స్పందించకపోతే ప్రాణనష్టం జరిగి ఉండేది. కాగా, వాగులో పడటం వల్ల దెబ్బలు తగిలిన శ్రీనును బస్సులో కొత్తగూడెం తరలించారు.

యువతి అదృశ్యంపై కేసు

చండ్రుగొండ: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన యువతి కనిపించకుండా పోయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ మంగళవారం రాత్రి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి (22) ఈ నెల 20 రాత్రి నుంచి కనిపించడం లేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తపాలా శాఖలో ఐటీ 2.0 సేవలు

తొలిరోజు అక్కడక్కడా సాంకేతిక సమస్యలు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖలో ఐటీ–2.0 సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సురక్షితంగా, వేగంగా వినియోగదారులకు సేవలు అందించమే లక్ష్యంగా తపాలా శాఖ కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఇప్పటికే కర్ణాటకతో పాటు హైదరాబాద్ సర్కిల్‌లో అమలవుతున్న విధానాన్ని మంగళవారం మిగతాచోట్ల ప్రారంభించగా, ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలోనూ అమల్లోకి వచ్చింది. డివిజనల్ కార్యాలయంతో పాటు పది సబ్ డివిజన్ కార్యాలయాలు, ఖమ్మం, కొత్తగూడం, భద్రాచలం హెడ్ పోస్టాఫీసులు, 70 సబ్ పోస్టాఫీసులు, 750 బ్రాంచిల్లో ఐటీ–2.0 ద్వారా పొదుపు పథకాలు, డిపాజిట్లు, బీమా, ఐపీపీబీ బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నారు. తొలిసారి తపాలా కార్యాలయాల్లో ఐటీ–2.0 సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి రాగా ఖమ్మం డివిజన్‌లోని పలు బ్రాంచ్‌ల్లో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో ఉద్యోగులు సమీప బ్రాంచ్‌ల ద్వారా సేవలందించారు.



ఖమ్మం హెడ్ పోస్టాఫీసులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

మెట్ట పంటలకు అనుకూలం..

- తేలికపాటి వానలతో ఆశాజనకంగా పత్తి, మొక్కజొన్న సాగు
- చెరువులు నిండకపోవటంతో వరినాట్లు ఆలస్యం



తేలికపాటి వానలతో పెరుగుతున్న పత్తి మొక్కలు

బూర్గంపాడు: ఈ సీజన్‌లో పడుతున్న తేలికపాటి వానలు మెట్ట పంటల సాగుకు అనుకూలంగా మారాయి. జిల్లాలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలకు అడపాదడపా కురుస్తున్న వానలు కలిసివస్తున్నాయి. వానాకాలం ఆరంభమై రెండు నెలలు కావస్తున్నా భారీ వర్షాలు కురవకపోవటంతో చెరువులు, కుంటలు నిండలేదు. దీంతో వరినాట్లు ఆలస్యమవుతున్నాయి. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో వరినాట్లు కూడా ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే వరినాట్లు కూడా ఊపందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సాధారణ వర్షపాతం..

ఈ ఏడాది జూన్‌లో జిల్లాలో కొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం, మరికొన్ని మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. రైతులు జూన్ ఆరంభం నుంచే మెట్టపంటల సాగుకు ఉపక్రమించారు. సుమారు 2.25 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేస్తున్నారు. ఇప్పటికే 2 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు పత్తి వేశారు. జూన్‌లో ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పత్తి మొలకశాతం కొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉంది. దీంతో రైతులు రెండో సారి పత్తి గింజలు వేసుకున్నారు. జూలైలో అడపాదడపా కురుస్తున్న తేలికపాటి వానలు పత్తి పంటకు జీవం పోశాయి. ప్రస్తుతం కురుస్తున్న వానలు పత్తికి మరింత అనుకూలంగా మారాయి. ప్రస్తుతం పత్తిచేలు అడుగు ఎత్తు పెరిగి ఆశాజనకంగా ఉన్నాయి. జూన్ మొదటివారంలో ముందుగా వేసిన పత్తి చేలు పూత దశకు చేరాయి. పత్తికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.589 మద్దతు ధరను పెంచింది. దీంతో క్వింటా పత్తి ధర రూ.8,100కు చేరింది. దీంతో జిల్లాలో అధిక విస్తీర్ణంలో పత్తిని సాగు చేశారు. అలాగే, 25 వేల ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు కూడా జూలైలో కురిసిన వానలు ఊపిరి పోశాయి. పత్తి, మొక్కజొన్నల చేలల్లో కలుపు తీసి రైతులు తొలివిడత ఎరువులు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. తేలికపాటి వానలతో కూరగాయల సాగు కూడా పెరగనుంది.

నిండని చెరువులు

ఇప్పటి వరకు జిల్లాలో భారీ వర్షాలు కురవకపోవటంతో చెరువులు, కుంటలు నిండలేదు. సరైన వానలు కురవక వరినార్లు కూడా ఒకనొక దశలో వడబడిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వానలకు జిల్లాలో వరినాట్లు కూడా మొదలయ్యాయి. తుమ్మలచెరువు, టేకులచెరువు, దోమలవాగు చెరువు వంటి పెద్దచెరువులకు నీరు రాలేదు. దీంతో వరినాట్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. రుతుపవనాలు బలపడటమో, అల్పపీడన ద్రోణి ప్రభావంతోనో జూలై చివరి వారం భారీ వర్షాలు కురిసి చెరువులు నిండితే పూర్తిస్థాయిలో వరినాట్లు పూర్తవుతాయి. భారీ వర్షాలు కురవకపోతే జిల్లాలో వరి సాగు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గోదావరి పరీవాహకంలో సాగు ఆలస్యం

ఏటా వరదల కారణంగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సాగు ఆలస్యమవుతోంది. ఆగస్టులో గోదావరి వరదలు చూసిన తరువాత రైతులు పంటలు సాగు చేసుకుంటారు. మూడేళ్లుగా జూలైలోనే గోదావరికి వరద రావడంతో రైతులు సాగుకు భయపడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు లేనికారణంగా ఇప్పటి వరకు గోదావరికి పెద్దగా వరద రాలేదు. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాల కారణంగా పదిరోజుల కిందట గోదావరికి 40 అడుగుల మేర వరద చేరింది. రెండు రోజుల వ్యవధిలోనే వరద పూర్తిగా తగ్గింది. ఈసారి వరద రాకపోవచ్చని భావిస్తున్న కొందరు రైతులు సాగుకు ఉపక్రమిస్తున్నారు.

పత్తికి అనుకూలంగా ఉంది



ఈ ఏడాది కురుస్తున్న తేలికపాటి వానలు పత్తి పంటకు అనుకూలంగా ఉన్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పత్తి ఏపుగా పెరుగుతోంది. తొలివిడత ఎరువులు వేయటం పూర్తయింది. మరో వారం రోజుల్లో రెండో విడత ఎరువులు వేస్తే పూతకు వస్తుంది.

–వై.వెంకట్రామిరెడ్డి, రైతు, రెడ్డిపాలెం

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

జూలూరుపాడు: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ కథనం ప్రకారం.. భేతాళపాడు జీపీ పంతులుతండాకు చెందిన ధరావత్ కాంతి (70).. తన పని తాను చేసుకునే పరిస్థితి లేక జీవితంపై విరక్తి చెంది ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ పేర్కొన్నారు.

ట్రాలీ ఆటోను ఢీకొట్టిన లారీ

ఒకరు మృతి



ధనుకోటి నరసింహ నాయుడు (ఫైల్)

పాల్వంచ: ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండా లారీ రివర్స్‌లో వచ్చి ట్రాలీ ఆటోను ఢీకొట్టడంతో ఉల్లిపాయల వ్యాపారి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాల్వంచ మున్సిపల్ పరిధిలోని రాంనగర్‌కు చెందిన ధనుకోటి నరసింహనాయుడు (43) ట్రాలీ ఆటోలో ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఉల్లిపాయలతో ఇంటి నుంచి బయలుదేరి కొత్తగూడెం వైపు వెళ్తున్నాడు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వద్ద యూటర్న్ వద్దకు రాగానే అక్కడ ఉన్న లారీడ్రైవర్ లారీని రివర్స్‌లో తీసుకొచ్చి ట్రాలీ ఆటోను ఢీకొట్టాడు. ఆటోలో ఇరుక్కున్న నరసింహనాయుడును బయటకు తీసి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. తలకు తీవ్ర గాయాలతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా లారీడ్రైవర్ ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన భూక్యా శ్రీనివాస్‌గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

పినపాక: మండలంలోని బయ్యారం గ్రామంలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బయ్యారంలోని ఓ ఇంట్లో పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.46 వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

ఇసుక అక్రమ నిల్వలు సీజ్

బూర్గంపాడు: సారపాక గ్రామ పంచాయతీలోని భాస్కర్‌నగర్‌లో ఇసుక అక్రమ నిల్వలను తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్ మంగళవారం సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సీజ్ చేసిన ఇసుకను గ్రామపంచాయతీ అధికారులకు అప్పగించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మహిళలు గాయపడిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బస్వతారాకకాలనీ బీసీఎం జాతీయ రహదారిపై కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజియోథెరపీ టీచర్లుగా పనిచేస్తున్న సత్యప్రియ, గాయత్రీ మంగళవారం విధులు ముగించుకుని స్కూటీపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన, బూర్గంపాడుకు చెందిన కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడి గాయపడగా.. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

■ ప్రముఖ సంస్థనందు B.Tech, డిప్లొమా, ITI, డిగ్రీ All & BSc నర్సింగ్ స్త్రీ/పు జీతం 18–30 Room + Meels Free Ph: 94419 12690 [SCA 25006605]

■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలోని ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్‌లో ఇంటివద్దనే వుండి పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. మంచి జీతం ✆ 91608 35559, 99121 15559 [B-168]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9963521122, 9963101122 [B-1275593]



సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు:

ఖమ్మం	9705444182
	9010299957
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.